క్లుప్తంగా

ఓటరు స్లిప్‌ల పంపిణీ పరిశీలన



ఓటరు స్లిప్‌ల పంపిణీని పరిశీలిస్తున్న తహసీల్దార్

హవేళిఘనాపూర్(మెదక్): మండల పరిధిలోని గుట్టకిందిపల్లి, ఖాజీపల్లి, వెంకటాపూర్ గ్రామాల్లో ఓటరు స్లిప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దార్ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు కలిగిన ప్రతీ ఒక్కరికి స్లిప్‌లు పంపిణీ చేయాలన్నారు. ఎన్నికల్లో ఎవరైనా డబ్బు, మద్యం పంపిణీ చేసి ప్రలోభాలకు గురిచేసేలా చేస్తే సీ - విజిల్ యాప్ ద్వారా, 1950కు ఫిర్యాదు చేస్తే వెంటనే అధికారులు స్పందించి, చర్యలు తీసుకుంటామన్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌ఓలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

దత్తగిరి మహారాజ్‌కు ఆహ్వాన పత్రిక



దత్తగిరి పీఠాధిపతులకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న వెంకటేశ్వరశర్మ

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గూడూర్ గ్రామంలో నెలకొల్పనున్న శ్రీ గురు పీఠం శిలాన్యాసంకు హాజరు కావాలని బర్దిపూర్‌లోని దత్తగిరి పీఠాధిపతులు మహారాజ్, వైరాగ్య శిఖామణికి ఆహ్వాన పత్రిక అందజేశారు. శ్రీ గురుపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు శివకుమార్‌గౌడ్, చారిటబుల్ ట్రస్ట్ సభ్యుడు, వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో శుక్రవారం మొదటి ఆహ్వాన పత్రిక అందజేశారు. డిసెంబర్ 7న శ్రీ గురుపీఠం శిలాన్యాస మహోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు శివకుమార్‌గౌడ్ తెలిపారు. విశ్వయోగి మహారాజ్ విశ్వ గురు పీఠాధిపతి శిలాన్యాసం చేస్తానని చెప్పారు.

చెండికాంబ ఆలయంలో పూజలు



చెండిలో కొలువైన చండికాంబ

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చండిలో కొలువైన చండికాంబ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకమాసం మొదటి శుక్రవారం సందర్భంగా ఆలయ అర్చకులు అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గం



ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గం

చేగుంట(తూప్రాన్): మండల ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా మనోహర్‌రావు పెంటాగౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు రాజగోపాల్, రాజు ఆధ్వర్యంలో శుక్రవారం చేగుంట నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శులుగా వారాల నర్సింలు, పాండు, సత్యనారాయణ, సమీలను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా పోచయ్య పరిశీలకులుగా రాములు వ్యవహరించారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

హవేళిఘనాపూర్(మెదక్): గుర్తు తెలియని వాహనం ఢీకొని 50 ఏళ్ల వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని పేరూరు శివారులో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ - బొడ్మట్‌పల్లి రహదారిపై పేరూరు శివారులో 50 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తిని ఓ వాహనం ఢీ కొనడంతో తలకు తీవ్ర గాయాలై మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి ఎరుపు రంగు షర్టు, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని, ఎవరైనా ఆచూకీ లభిస్తే మెదక్ రూరల్ పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. మృతదేహాన్ని మెదక్ ప్రభుత్వ ఆస్పత్రిలో మార్చురీలో ఉంచినట్లు తెలిపారు.

మురికి కూపాలుగా కాలనీలు



ఇళ్ల మధ్య మురికి కూపం



గ్రామస్తులు చంపిన పాములు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట గ్రామంలోని ఎస్సీ హాస్టల్ సమీప గృహాలు మురికి కూపాల మధ్య నివాసం ఉంటున్నారు. నిత్యం పాములు సంచరిస్తుండడంతో భయాందోళనకు గురవుతున్నారు. రంగంపేట గ్రామంలోని కొత్త కాలనీకి సమీపంలో అనేక నూతన గృహాలు వెలిశాయి. ఇళ్లలో నుంచి మురుగునీరు వెళ్లేందుకు పూర్తి స్థాయిలో మురికి కాల్వలు నిర్మించకుండా మధ్యలోనే ఆపేశారు. దీంతో ఇళ్ల ఎదుట మురికి నీరు నిలిచి కుంటలను తలపిస్తున్నాయి. దుర్గంధం వెదజల్లడం, దోమలు స్వైర విహారం చేస్తుండడంతో అనారోగ్యాల బారిన పడుతున్నామని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. గ్రామ పంచాయతీ అధికారులకు, నేతలకు మొరపెట్టుకున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ అధికారిని 'సాక్షి' ఫోన్ ద్వారా సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

బీఆర్‌ఎస్‌తోనే గిరిజనుల అభివృద్ధి



మాట్లాడుతున్న గిరిజన సంఘాల నాయకులు

నర్సాపూర్: బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక గిరిజనులు అన్ని రకాలుగా అభివృద్ధి చెందారని ప్రస్తుత ఎన్నికల్లో గిరిజనులు బీఆర్‌ఎస్ వెంట ఉంటారని గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ బంజారా అన్నారు. శుక్రవారం ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... తమ సంఘం నాయకులతో పాటు బంజారా హక్కుల పోరాట సమితి నాయకులు కలిసి నర్సాపూర్ నియోజకవర్గంలో పర్యటించి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డికి మద్దతుగా ప్రచారం చేశామని చెప్పారు. గిరిజనులు ఏకపక్షంగా రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు మద్దతుగా ఉన్నారని, నర్సాపూర్‌లో సైతం బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతారెడ్డికి అండగా ఉన్నందున ఆమె విజయం ఖాయమన్నారు. సీఎం కేసీఆర్ తండాలను గ్రామ పంచాయతీలుగా చేసి, వాటి అభివృద్ధికి కృషి చేశారన్నారు. ప్రచారంలో తనతో పాటు బంజారా హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి రోహిత్‌నాయక్‌తో పాటు గిరిజన సంఘాల నాయకులు శ్రీను, సుధీర్, అరున్, రాజేందర్, శ్రీనివాస్, రాజు, జెడ్పీటీసీ సభ్యుడు బబియా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో కేసీఆర్‌కు ఎదురులేదు

మనోహరాబాద్(తూప్రాన్): గజ్వేల్‌లో సీఎం కేసీఆర్‌కు ఎదురులేదని రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్లు ఎలక్షన్‌రెడ్డి, భూపతిరెడ్డిలు, రాష్ట్ర నాయకులు శేఖర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మనోహరాబాద్ మండలంలో పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఓటర్లతో మాట్లాడుతూ.. గజ్వేల్‌లో సీఎం కేసీఆర్‌కు భారీ మెజార్టీ ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ పీఏసీఎస్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌లు ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ మహిపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పురం మహేశ్, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, సర్పంచ్‌లు నర్సయ్య, సుగుణ, ఉప సర్పంచ్‌లు నవీన్‌చారి, ధర్మేందర్, తుమ్మల రాజు, మహేందర్‌గౌడ్, రేణుకుమార్, నాయకులు పురం రవి, పెంటాగౌడ్, వెంకటేష్, భిక్షపతి, కుమార్, పాండుగౌడ్, తదితరులున్నారు.

నాయకుల ప్రచారం

అల్లాదుర్గం(మెదక్): అందోల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి క్రాంతి కిరణ్‌కు మద్దతుగా మండల పరిధిలోని ముస్లాపూర్ గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే బోర్డు మెంబర్ కాశీనాథ్, పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, నాయకులు ఆశయ్య, మల్లేశం, ప్రకాశం, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటతో పాటు పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ముమ్మరం ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ నర్సాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

వేంకటేశ్వర ఆలయంలో హోమం



హోమం చేస్తున్న ధర్మకర్త కిషన్‌రావు

చేగుంట(తూప్రాన్): మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో వేంకటేశ్వర ఆలయంలో శుక్రవారం మహా మృత్యుంజయ హోమం నిర్వహించారు. ఉదయం స్వామివారికి అర్చన, అభిషేకం చేసి మధ్యాహ్నం హోమం పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కిషన్‌రావు, సర్పంచ్ రాములు, అర్చకులు పురుషోత్తంచారి, రఘునాథ్ చారి, ఆలయ నిర్వాహకులు మల్లేశం, నాయకులు భిక్షపతి, కన్నకయ్య, రాజు, సురేశ్, శ్రీకాంత్, వినయ్‌కుమార్, అజయ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు మరవద్దు



ఓటర్ స్లిప్పులు అందిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్‌చారి

శివ్వంపేట(నర్సాపూర్): ఓటుహక్కుకు సంబంధించి సిబ్బంది ఓటరు స్లిప్పుల పంపిణీ ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. మండల కేంద్రమైన శివ్వంపేటతో పాటు అన్ని గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఓటర్లకు బీఎల్‌ఓలు ఓటరు స్లిప్పులను శుక్రవారం అందజేశారు. ఈ నెల 30న ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటరు స్లిప్పుతో పాటు ఓటర్ గైడ్, సీ- విజిల్ పత్రాలు అందిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్‌చారి తెలిపారు. పోలింగ్ రోజు ఓటర్లు సిబ్బంది ఇచ్చిన స్లిప్పులతో పాటు ఏదైన వారికి సంబంధించిన గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

బీజేపీ వైపు మొగ్గు చూపుతున్న సర్పంచ్‌లు

- చాపకింద నీరులా బీజేపీలో చేరుతున్న ప్రజాప్రతినిధులు

మనోహరాబాద్(తూప్రాన్): గజ్వేల్‌లో బీజేపీ తరఫున ఈటల రాజేందర్ నిలబడటంతో అసంతృప్తితో ఉన్న పలు గ్రామాల సర్పంచ్‌లు మండలంలోని బీజేపీలో చేరేందుకు సిద్ధమయ్యారు. రెండు రోజుల్లో పెద్ద ఎత్తున కార్యకర్తలతో కలిసి బీసీ సర్పంచ్‌లు ఓసీ సర్పంచ్ కూడా బీజేపీలో చేరుతున్నామని తెలిపారు. ఇప్పటికే కాళ్లకల్ గ్రామ సర్పంచ్ మల్లేశ్ బీజేపీలో చేరి గ్రామాల్లో ప్రచారం చేశారు. కాగా బీఆర్‌ఎస్ నాయకులు బుజ్జగింపు చర్యలు చేపట్టినా.. తమకు విలువ లేని చోట ఉండలేమని ససేమీరా అంటున్నట్లు సమాచారం. ఎన్నికల వేడి పెరుగుతున్న కొలది పార్టీలలోకి చేరికలు జోరందుకుంటాయని బీజేపీ నాయకులు చెబుతున్నారు.

ఈటలకు బ్రహ్మరథం

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని గ్రామాల్లో ప్రజలు ఈటలకు బ్రహ్మరథం పడుతున్నారని రాష్ట్ర సర్పంచ్‌ల పోరం ఉపాధ్యక్షుడు మల్లేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పాలాట గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరికి అందుబాటులో ఉంటే ఈటలకే తమ మద్దతుని తెలిపేందుకు గ్రామాల్లో ప్రజలు స్వచ్ఛందగా ముందుకు వస్తున్నారన్నారు. కాగా పాలాట గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు పాండు బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కమ్మరి నరేందర్‌చారి, అజయ్, నాగరాజు, మల్లేశ్, సాదు నర్సింలు, ఆంజనేయులు, నరేశ్‌గౌడ్, వెంకట్‌గౌడ్, అయిలయ్య యాదవ్, తదితరులు ఉన్నారు.

ప్రయాణికుల భద్రతే ఆర్టీసీ ధ్యేయం



సిబ్బందిని సన్మానిస్తున్న డిపో మేనేజర్ సురేఖ తదితరులు

గజ్వేల్‌రూరల్: ప్రయాణికుల భద్రతే ఆర్టీసీ ధ్యేయమని జీపీపీ(గజ్వేల్ - ప్రజ్ఞాపూర్) డిపో మేనేజర్ సురేఖ పేర్కొన్నారు. రోడ్ సేఫ్టీ డేని పురస్కరించుకొని శుక్రవారం డిపోలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమాశశితో కలిసి డిపో పరిధిలోని ఉత్తమ డ్రైవర్లను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 26 ఏళ్లుగా ఒక్క ప్రమాదం జరగకుండా విధులు నిర్వహించిన ఎండి మోసిన్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఉత్తమ డ్రైవర్లు, కండక్టర్లకు ప్రగతి చక్రం పురస్కారాలు, మెకానిక్ సెక్షన్‌లో సేవలందిస్తున్న పలువురికి ప్రశంసా పత్రాలను అందజేశారు.

అభివృద్ధిని చూడండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అంజిరెడ్డి

ములుగు(గజ్వేల్): తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తరువాత జరుగుతున్న అభివృద్ధిని యువత చూడాలని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి అన్నారు. అంజిరెడ్డి నిర్మాతగా, హీరో అనిల్ మొగిలి ముఖ్యపాత్రలో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిపై తీసిన 'శపథం' లఘు చిత్రం పోస్టర్‌ను ములుగులో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వలాభం, రాజకీయ జీవితం కోసం ప్రజలను మోసం చేసే వారికి గుణపాఠం చెప్పేలా, తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసింది ఎవరు అని అర్థం చేసుకునే విధంగా ఈ డ్యాకుమెంటరీ రూపొందించామన్నారు. సహ నిర్మాతగా గోలి సంతోష్‌కుమార్ గుప్త, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా రాచర్ల నరేష్‌గుప్తా సారథ్యంలో తీసినటువంటి శపథం డాక్యుమెంటరీ వీడియోను త్వరలో విడుదల చేస్తామన్నారు. కార్యక్రమంలో హీరో అనిల్ మొగిలి, ఎంపీటీసీ లింగారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

టేక్మాల్(మెదక్): నిబంధనలు అతిక్రమిస్తే ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఎన్నికల స్పెషల్ స్క్వాడ్ రాం ప్రసాద్ తెలిపారు. ఎన్నికల సందర్భంగా మండల కేంద్రమైన టేక్మాల్‌లో శుక్రవారం వాహనాలను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిబంధనల ప్రకారం రూ.50వేలకు మించి డబ్బులను తమ వెంట తీసుకుపోరాదన్నారు. అధిక డబ్బులు తీసుకుపోతే సీజ్ చేస్తామని తెలిపారు. ఎన్నికలు సాఫీగా సాగేందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు.

ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

తూప్రాన్: ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యమని గజ్వేల్ కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి అన్నారు. శుక్రవారం తూప్రాన్‌లో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీపై బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని, లేని పక్షంలో తమ నాయకులు, కార్యకర్తలే బుద్ధి చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజల కోసం ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తుందని, దీంతో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్‌కు మంచి ఆదరణ లభిస్తుందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు భాస్కర్‌రెడ్డి, రవీందర్‌గుప్తా, మహేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సత్యనారయణ, యాదగిరి, నాగరాజుగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు పూజలు



నర్సన్నపేటలో దుర్గమ్మకు పూజలు చేస్తున్న మహిళలు

మర్కూక్(గజ్వేల్): సీఎం కేసీఆర్ పేరిట బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం గజ్వేల్‌లో లక్ష మెజార్టీతో గెలుపొందాలని మండలంలోని నర్సన్న పేట సర్పంచ్ మాధవి, జెడ్పీటీసీ సభ్యురాలు మంగమ్మ ఆధ్వర్యంలో గ్రామ మహిళలు దుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు చేశారు.

'ఈటల గెలుపు ఖాయం'

మర్కూక్ (గజ్వేల్): గజ్వేల్‌లో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ భారీ మెజార్టీతో గెలుపొందుతారని గోవా ఎమ్మెల్యే దయానంద్ సోపటే అన్నారు. మర్కూక్‌లో బీజేపీ మండల ఎన్నికల ఇన్‌చార్జి సింగం సత్తయ్య, మండల అధ్యక్షుడు రమేశ్ గుప్త ఆధ్వర్యంలో శుక్రవారం మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో 119 నియోజకవర్గాల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, బీజేపీ అధికారంలోకి వస్తేనే గోవా తరహాలో అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యకర్తలు బీజేపీ మెనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

సిద్దిపేట ఎడ్యుకేషన్: గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ (అటానమస్) డిగ్రీ కళాశాల డాక్టర్ ప్రసాద్ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో ఏర్పాటుచేసిన పుస్తక ప్రదర్శనను ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, లైబ్రేరియన్ డాక్టర్ ఆవుల పాటి వేణు, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ గోపాల సుదర్శనం, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రవి కుమార్, ఆంజనేయులు పాల్గొన్నారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

- మాజీ మంత్రి బాబుమోహన్

టేక్మాల్(మెదక్): రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ మంత్రి బాబుమోహన్ అన్నారు. శుక్రవారం టేక్మాల్ మండలంలోని అచ్చన్నపల్లి గ్రామంలో బీజేపీకి ఓటు వేసి తనను గెలిపించాలని కోరుతూ.. ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందోల్‌ను అభివృద్ధి చేసింది తానేనని తెలిపారు. నియోజకవర్గంలో అవసరమైన చోట లిఫ్టులను ఏర్పాటు చేసి రైతులకు సాగునీటిని కల్పించినట్లు గుర్తు చేశారు. అభివృద్ధి సంక్షేమ పథకాలు అందాలంటే అభివృద్ధి చేసే వారికి ఓటు వేయాలని కోరారు. బీఆర్‌ఎస్ పార్టీ ప్రజలకు చేసింది ఏం లేదని తెలిపారు. ఇందులో మండల అధ్యక్షుడు రాజు, నాయకులు రెడ్యానాయక్, సిద్ధు, దుర్గాప్రసాద్, సుదర్శన్, ప్రభుతో పాటు తదితరులు ఉన్నారు.

మిర్జాపల్లి జెడ్పీపాఠశాలలో మాక్‌పోలింగ్



మాక్‌పోలింగ్‌లో విద్యార్థులు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని మిర్జాపల్లి జెడ్పీపాఠశాలలో శుక్రవారం మాక్‌పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం పుష్పవేణి మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు ఓటుహక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఓటుహక్కు ప్రాధాన్యతను తెలిపేందుకే మాక్‌పోలింగ్ నిర్వహించినట్లు చెప్పారు. ఈ మేరకు నలుగురు విద్యార్థులు పోటీలో నిలవగా భానుప్రసాద్ గెలుపొందారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భార్య పుట్టింటికీ వెళ్లిందని వ్యక్తి ఆత్మహత్య



బోడ్ల సిద్ధిరాములు

చిన్నశంకరంపేట(మెదక్): భార్య పుట్టింటికీ వెళ్లిందని పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించిన వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలం సూరారం గ్రామంలో చోటుచేసుకుంది. శుక్రవారం చిన్నశంకరంపేట ఎస్‌ఐ నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సూరారం గ్రామానికి చెందిన బోండ్ల సిద్ధిరాములు(32) ఈ నెల 12న భార్య మమతతో గొడవ పడ్డాడు. దీంతో ఆమె పుట్టింటికీ వెళ్లగా భర్త సిద్ధిరాములు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి తల్లి ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ.. వ్యక్తి మృతి



గంపల్లి నర్సింలు

పాపన్నపేట(మెదక్): చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రం పాపన్నపేటలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి కథనం ప్రకారం.. పాపన్నపేటకు చెందిన జంగంపల్లి నర్సింలు(34) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ.. ఈనెల 8న మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అప్పుడే మార్కెట్ నుంచి ఇంటికి వచ్చిన తల్లి రామమ్మ ఇరుగు పొరుగు వారి సాయంతో మెదక్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వారి సూచన మేరకు అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ.. గురువారం రాత్రి మరణించాడు. అతనికి భార్య మంజుల, ఇద్దరు కుమారులు ఉన్నారు. రామమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ప్రయోగాత్మక బోధనతో లబ్ధి



సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి భాస్కర్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రయోగాత్మక విద్య విద్యార్థులకు ఉపయోగపడుతుందని విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి భాస్కర్, ఎర్త్ ఫౌండేషన్ డైరెక్టర్ వెన్నెల అన్నారు. శుక్రవారం ఎర్త్ ఫౌండేషన్ ఆన్ వీల్స్ మొబైల్ సైన్స్ ల్యాబ్ లెర్నింగ్ స్కిల్స్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయులకు పరికరాల ద్వారా శిక్షణ ఇవ్వడంతోపాటు, విద్యార్థులకు ఎలా బోధించాలో తెలపడం వినూత్నంగా ఉందన్నారు.

పాఠశాల సందర్శన

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా సెక్టోరియల్ అధికారి భాస్కర్ శుక్రవారం సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి హాజరయ్యారు. ఎఫ్‌ఎల్‌ఎన్ పాఠశాల స్థాయిలో అమలుపై పలు సూచనలు చేశారు. సమావేశంలో మండల నోడల్ అధికారి అంజయ్య, భూంపల్లి కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ రాజేందర్, చిట్టాపూర్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ ప్రభాకర్ రెడ్డి, రిసోర్స్ పర్సన్‌లు తదితరులు పాల్గొన్నారు.